# పత్తి కొనుగోలు నిబంధనల ప్రకారం

- రైతులకు అవగాహన కల్పించాలి:
- కలెక్టర్ కుమార్ దీపక్

**శెనార్తి మీడియా, మంచిర్యాల:**



నిబంధనల ప్రకారం పత్తి కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించబడుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. సోమవారం లక్షెట్టిపేట మండలంలోని దండేపల్లి గ్రామంలో గల వెంకటేశ్వర కాటన్ మిల్‌లో సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని జిల్లా వ్యవసాయ అధికారి సురేఖ, జిల్లా మార్కెటింగ్ అధికారి షాహబుద్దీన్, సీసీఐ అధికారులు, తహసీల్దార్ దిలీప్ కుమార్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రభుత్వం రైతుల సంక్షేమం దృష్ట్యా సీసీఐ ద్వారా పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధర చెల్లింపుతో కొనుగోలు నిర్వహిస్తోందని తెలిపారు. 2025–26 సంవత్సరానికి రైతులు "కపాస్ కిసాన్ యాప్"లో తమ వివరాలు నమోదు చేసుకుని పత్తి విక్రయాని కి స్లాట్ బుక్ చేసుకోవాలని సూచించారు. సీజన్‌లో ఎల్–1, ఎల్–2, ఎల్–3 స్థాయిలలో స్లాట్ బుకింగ్ విధానం అమలులో ఉందని, ప్రతి స్థాయిలో 75 శాతం స్లాట్‌లు బుక్ అయిన తర్వాత తదుపరి స్థాయి ప్రారంభమవుతుందని వివరించారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా సమన్వయంతో చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పత్తి కొనుగోలు సమయంలో తేమ శాతం 8 నుండి 12 మధ్య ఉండాలని, ఇతర నాణ్యత ప్రమాణాలను కూడా పాటించాలని సూచించారు. రైతులకు చెల్లింపులు ఆధార్‌తో అనుసంధానమైన బ్యాంకు ఖాతాలోనే జరుగుతాయని తెలిపారు. ఆధార్ కార్డులో ఫోటో కలిగిన రైతులే తక్పట్టిలో హాజరు కావాలన్నారు. క్రాప్ బుకింగ్‌లో నమోదైన రైతుల నుంచే పత్తి కొను గోలు చేయాలని, మధ్యవర్తులు కొనుగోలు చేసిన పత్తిని కేంద్రాల్లో అనుమతించరాదని స్పష్టం చేశారు. పత్తితో పాటు వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ కూడా జిల్లాలో ప్రారంభించామని, రైతు లు నిబంధనలకు అనుగుణంగా నాణ్యమైన ధాన్యాన్ని తీసుకురావాలని తెలిపారు. ఈ కార్య క్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్, సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## పత్తి, వరి కొనుగోలుపై సమీక్ష

- రైతులకు లబ్ధి చేకూరేలా చర్యలు : జిల్లా కలెక్టర్

**శెనార్తి మీడియా, మంచిర్యాల:**

రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా నిబంధనలకు లోబడి పత్తి, వరి ధాన్యాన్ని కొనుగోలు చేసి మద్దతు ధర చెల్లించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. సోమవారం తాండూర్ మండలం లోని మహేశ్వరి కాటన్స్ జిన్నింగ్ మిల్లులో సిసిఐ ద్వారా పత్తి కొనుగోలు కార్యక్రమాన్ని జిల్లా వ్యవసాయ అధికారి సురేఖ, జిల్లా మార్కెటింగ్ అధికారి షాహబోద్దీన్, మండల తహసీల్దార్ జ్యోత్స్నలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో మూడు జిన్నింగ్ మిల్లులలో సిసిఐ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వం రైతు ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని కపాస్ కిసాన్ యాప్ ద్వారా పత్తి విక్రయం స్లాట్లు బుక్ చేసుకునే సదుపాయం కల్పించినట్లు వివరించారు. పత్తిలో తేమ శాతం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని నిబంధనల ప్రకారం మాత్రమే కొనుగోలు జరపాలని సూచించారు. ఆధార్‌తో అనుసంధానమైన బ్యాంకు ఖాతాల్లోనే చెల్లింపులు జరుగుతాయని, రైతులు తమ ఆధార్ కార్డులో ఉన్న ఫోటో ఆధారంగా తక్పట్టిలో ఫోటో దిగవలసి ఉంటుందని చెప్పారు. ఇటీవల వర్షాల కారణంగా పత్తి ఉత్పత్తి కొంత తగ్గిందని, అయినప్పటికీ సిసిఐ ద్వారా మద్దతు ధరతో రైతుల వద్ద నుండి కొనుగోలు కొనసాగుతోందని తెలిపారు. క్రాప్ బుకింగ్‌లో నమోదైన రైతుల నుండి మాత్రమే కొనుగోలు చేయాలని, దళారులు సేకరించిన పత్తిని కేంద్రాల్లోకి అనుమతించకూడదని కలెక్టర్ హెచ్చరించారు. పత్తితో పాటు వరి ధాన్యం కొనుగోలు కూడా సమాంతరంగా జరుగుతుందని, రైతులు నాణ్యమైన ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ, మార్కెటింగ్ శాఖాధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులు త్వరగా పరిష్కరించాలి : కలెక్టర్



**శెనార్తి మీడియా, మంచిర్యాల:**

ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించాల్సిందిగా సంబంధిత శాఖాధికారులకు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. సోమవారం నస్పూర్ సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి. చంద్రయ్య, మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావులతో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా గోపాల్వాడకు చెందిన రౌతు మంగమ్మ, హమాలీవాడకు చెందిన సూరం మల్లయ్య వృద్ధాప్య పింఛను మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తులు సమర్పించారు. దండేపల్లి మండలం ధర్మారావుపేటకు చెందిన కొల్లూరి సుగుణ తన ఇంటి స్థలంలో అక్రమంగా నిర్మాణం చేపట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని అర్జీ సమర్పించింది. శ్రీ శ్రీ నగర్‌కు చెందిన జాడి రాజమల్లు ఆర్‌టిఐ చట్టం ప్రకారం దరఖాస్తు చేసుకున్న సమాచారం అందించాలంటూ వినతిపత్రం ఇచ్చాడు. నస్పూర్ మండలం శ్రీరాం నగర్‌కు చెందిన ఎర్రం నర్సయ్య, సందవేని మల్లయ్య జీరో బిల్లు పథకం వర్తింపజేయాలని కోరారు. హాజీపూర్ మండలం పడ్తనపల్లి గ్రామానికి చెందిన కాంపెల్లి విజయ్ సాగర్ తమ నివాస ప్రాంతంలో పందుల వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని, సమస్య పరిష్కరించాలని కోరాడు. జైపూర్ మండలం ముదిగుంట గ్రామానికి చెందిన గోదారి లక్ష్మణ్ నర్వ గ్రామ శివారులోని తన భూములు రెవెన్యూ రికార్డుల్లో ఇతరుల పేర్లపై నమోదయ్యాయని, తన పేరిట సరిదిద్దాలని అభ్యర్థించాడు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రజావాణి ద్వారా ప్రజలు తమ సమస్యలను నేరుగా తెలియజేస్తున్నందున, ప్రతి దరఖాస్తును సమయానుకూలంగా విచారించి పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మత్స్యకారుల సంక్షేమానికి చేప పిల్లల పంపిణీ

- పారదర్శకంగా చేపట్టాలని మంత్రి శ్రీహరి సూచన

**శెనార్తి మీడియా, మంచిర్యాల:**



రాష్ట్రవ్యాప్తంగా మత్స్యకారుల సంక్షేమం దిశగా చేప పిల్లల పంపిణీ కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రారంభించిందని పశుసంవర్ధక, మత్స్య, పాడి పరిశ్రమ, క్రీడా యువజన శాఖ మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. సోమవారం హైదరాబాద్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, మత్స్యశాఖ అధికారులు, సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... మత్స్యకారుల ఆదాయ వనరులు పెంపొందించేందుకు చేప పిల్లల పంపిణీ కార్యక్రమం చేపట్టామని తెలిపారు. ఇందుకోసం ప్రభుత్వం 122.22 కోట్ల రూపాయలను కేటాయించి 83.86 కోట్ల చేప పిల్లలను 26,357 నీటి వనరులలో వదిలేందుకు ప్రణాళికలు సిద్ధం చేసిందని వివరించారు. జిల్లా మత్స్యశాఖలు రూట్ మ్యాప్ సిద్ధం చేసుకుని పారదర్శకంగా చేప పిల్లల పంపిణీ నిర్వహించాలని సూచించారు. ప్రతి రోజు వివరాలను 'టి మత్స్య యాప్'లో నవీకరించాలన్నారు. ఈ నెల 20వ తేదీలోగా పంపిణీ కార్యక్రమాన్ని పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సారి 7 లక్షల టన్నుల చేపల ఉత్పత్తి లక్ష్యంగా నిర్ణయించినట్లు తెలిపారు. ప్రజా ప్రతినిధుల సమక్షంలో చేప పిల్లల పంపిణీ నిర్వహించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, జిల్లాల వారీగా చేపల రిటైల్ మార్కెట్ స్థాపనకు అనువైన స్థలాలను గుర్తించి మత్స్యకారులను ప్రోత్సహించాలని మంత్రి సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ లక్షెట్టిపేట తహసీల్దార్ కార్యాలయం నుండి పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ... 2025–26 సంవత్సరానికి గాను 223.93 లక్షల చేప పిల్లలను పెంచేందుకు ప్రతిపాదన సిద్ధం చేశామని తెలిపారు. జిల్లాలోని 380 చెరువులు, రిజర్వాయర్లలో 369 సీజనల్ చెరువులకు 115.65 లక్షల 35–40 మిల్లీమీటర్ల చేప పిల్లలు, 5 పేరినియల్ చెరువులు, 6 రిజర్వాయర్లలో 108.28 లక్షల 80–100 మిల్లీమీటర్ల చేప పిల్లలను వదిలే చర్యలు చేపడుతున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖ అధికారి అవినాష్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.






# దూదిపూల దుఃఖం చూడండి!

- ఆదిలాబాద్ లో పత్తి రైతులను చూస్తే కన్నీళ్లు వస్తున్నయ్
- బీజేపీ ఎంపీ, ఎమ్మెల్యే తేమ శాతం సడలింపుపై కేంద్రాన్ని ఒప్పించాలి
- తెలంగాణ జాగృతి రాష్ట్ర అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత
- ఆదిలాబాద్ జిల్లాలో జాగృతి జనంబాట..

**శెనార్తి మీడియా, ఆదిలాబాద్:**





"తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి గారు జూబ్లీహిల్స్ ఎన్నికలు పక్కన పెట్టండి.. తుఫాన్ కారణంగా తీవ్రంగా నష్టపోయిన రైతుల సంగతి చూడండి.. అక్కడ ఏ పార్టీ గెలిచినా ఒరిగేదేమీ లేదు" అని తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. తుఫాను ప్రభావం కారణంగా రాష్ట్రంలో రైతుల పరిస్థితి దయనీయంగా ఉందని, ఆదిలాబాద్ జిల్లాలో పత్తి రైతుల పరిస్థితి చూస్తుంటే కన్నీళ్లు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక్కడి బీజేపీ ఎంపీతో పాటు శాసనసభ పక్ష ఉప నేతగా ఉన్న స్థానిక ఎమ్మెల్యే పాయల్ శంకర్ ప్రధాని మోడీ, కేంద్ర మంత్రికి తేమ శాతంలో సడలింపు కోసం లేఖ రాయలని 20 నుంచి 25శాతం వరకు తేమ ఉన్నా కొనుగోలు చేసేలా చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు. జాగృతి జనం బాట కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆదిలాబాద్ జిల్లాలో పర్యటించారు.ముందుగా కొమురం భీం,ప్రొఫెసర్ జయ శంకర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమెకు జాగృతి శ్రేణులు గుస్సాడి నృత్యాలు, బతుకమ్మలతో స్వాగతం పలికారు. అనంతరం మార్కెట్ యార్డును సందర్శించిన కవిత అక్కడి పత్తి రైతులతో మాట్లాడారు. పత్తి కొనుగోళ్లు, తేమ శాతం నిబంధన్ కారణంగా తీవ్రంగా నష్టపోతున్నామని పలువురు రైతులు ఆమెకు వివరించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ ఆదిలాబాద్ లో పత్తి రైతుల పరిస్థితి చూస్తుంటే ఆవేదన కలుగుతుందని వర్షాలు పడుతున్న కారణంగా పత్తిలో తేమ శాతం అధికంగా చూపిస్తుందని చెప్పారు. బీజేపీ, కాంగ్రెస్ ప్రభుత్వాలకు రైతులంటే లెక్కలేదని మండిపడ్డారు. పత్తిలో 12శాతం తేమ ఉంటేనే కొనుగోలు చేస్తామని సీసీఐ చెబుతోందని ఇక్కడ మొంథా తుఫాను కారణంగా వర్షాలు పడిన విషయం ప్రభుత్వాలకు తెలియదా అని ప్రశ్నించారు. పత్తి రైతులే కాకుండా వరి, సోయా, మొక్కజొన్న రైతుల పరిస్థితి కూడా ఇలాగే ఉందని తెలిపారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం తేమ, బూజు,మొలకెత్తినా కొనుగోలు చేసిందని గుర్తు చేశారు. ఈ ప్రభుత్వాలు సైతం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. యూరియా కూడా సమయానికి రాదని ఇద్దరు కేంద్ర మంత్రులు మాట్లాడితే కేంద్రం అంగీకరించదా అని ప్రశ్నించారు.రైతుల కోసం బీజేపీ నేతలు ఒళ్ళు నొప్పించుకొని పనిచేయాలని హితవు పలికారు. అంతకుముందు తేమ విషయంలో జిల్లా కలెక్టర్ తో ఫోన్ లో మాట్లాడారు. మార్కెట్ యార్డులో పనిచేస్తున్న మహిళా హమాలీ కార్మికులను తొలగించకూడదని పేర్కొన్నారు.



## మద్యం మత్తులో హంగామా

- ఇద్దరిపై న్యూసెన్స్ కేసు నమోదు

**శెనార్తి మీడియా, మంచిర్యాల:**

మద్యం సేవించి అల్లరి చేసిన ఇద్దరు వ్యక్తులపై న్యూసెన్స్ కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ ప్రమోద్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, మంచిర్యాల రాజీవ్ నగర్ కాలనీలోని సంతోష్ కిరాణా దుకాణం వద్ద ఆదివారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో చిప్పకుర్తి సతీష్, సబ్బని రాజు మద్యం సేవిస్తూ హడావుడి చేస్తుండగా 100 నంబర్‌కు ఫిర్యాదు అందిందన్నారు. దీంతో బ్లూ కోర్టు సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ సంజీవ్, రాజు అక్కడికి చేరుకుని వారిని అరికట్టగా, మద్యం మత్తులో ఉన్న ఇద్దరు దురుసుగా ప్రవర్తించి పోలీసులపై దాడికి యత్నించినట్లు తెలిపారు. అనంతరం వారిని అదుపులోకి తీసుకుని డ్యూటీలో ఉన్న పోలీసులపై దాడికి ప్రయత్నం చేసినందుకు న్యూసెన్స్ కేసు నమోదు చేసినట్లు వివరించారు.

## యువజన ఉత్సవాల తేదీ మార్పు

- జిల్లా స్థాయి పోటీలు నవంబర్ 6న

**శెనార్తి మీడియా, మంచిర్యాల:**



జాతీయ యువజన ఉత్సవాల సందర్భంగా జిల్లాస్థాయి యువజన ఉత్సవాల పోటీల తేదీని నవంబర్ 6కు మార్పు చేసినట్లు జిల్లా క్రీడా, యువజన సేవల శాఖ అధికారి హనుమంతరావు తెలిపారు. ఈనెల 6వ తేదీ ఉదయం 9 గంటలకు జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో పోటీలు నిర్వహించనున్నట్లు వివరించారు. 15 నుండి 29 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన యువతకు ఈ పోటీలు నిర్వహించబడతాయని తెలిపారు. జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన వారికి రాష్ట్ర స్థాయి యువజనోత్సవాలకు అవకాశం కల్పిస్తామని, రాష్ట్ర స్థాయిలో విజేతలు 2026 జనవరి 10 నుండి 12 వరకు న్యూఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి యువజన ఉత్సవాలలో పాల్గొంటారని తెలిపారు. జానపద నృత్యం, జానపద గానం విభాగాల్లో బృంద సభ్యులు 10 మందికి మించరాదని, ప్రదర్శనలు భారత సంప్రదాయానికి అనుగుణంగా ఉండాలని, సినిమా పాటలు అనుమతించబడవని చెప్పారు. వాయిద్య పరికరాలు అభ్యర్థులే తెచ్చుకోవాలని, ప్రత్యక్ష ప్రదర్శనలకు ప్రాధాన్యత ఉంటుందని వివరించారు. కథా రచన, వ్యాస రచన, కవిత్వం విభాగాల్లో ఒక్కొక్కరు ఒక్క రచన మాత్రమే సమర్పించాలని, కులం, మతం, వర్గం, జాతిని కించపరిచే అంశాలు లేకూడదని పేర్కొన్నారు. పెయింటింగ్ విభాగంలో 'నషా ముక్త్ యువ / యూత్ ఫర్ హెల్తీ లైఫ్ స్టైల్' అంశంపై ఎ–3 సైజులో 90 నిమిషాల్లో పూర్తి చేయాలని తెలిపారు. ఉపన్యాసం (వక్తృత్వం) విభాగంలో ఎమర్జెన్సీ పీరియడ్ అండ్ వయోలేషన్ ఆఫ్ కాన్స్టిట్యూషన్ ఇన్ ఇండియా, "సేఫ్ గార్డింగ్ డెమోక్రసీ అండ్ డెమోక్రటిక్ వాల్యూస్" అంశాలపై హిందీ లేదా ఇంగ్లీష్‌లో 7 నిమిషాల్లో మాట్లాడాలని తెలిపారు. ఇన్నోవేషన్ ట్రాక్ విభాగంలో "ఎగ్జిబిషన్ ఆఫ్ సైన్స్ మేళ" అంశంపై పర్యావరణం, వాతావరణ మార్పులు, ఆరోగ్య సంక్షోభాలు వంటి అంశాలపై ఆవిష్కరణాత్మక ఆలోచనలను ప్రదర్శించాలని తెలిపారు. ఆసక్తి గల యువత తమ పేర్లు నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని ఎస్–28లో గల జిల్లా యువజన, క్రీడల కార్యాలయంలో లేదా ఇమెయిల్: dysomncl@gmail.com, వాట్సప్ నంబర్ 9963539234 ద్వారా నమోదు చేసుకోవచ్చని హనుమంతరావు తెలిపారు.

## ఉచిత చేప పిల్లల పంపిణీ 4న ప్రారంభం

- జిల్లా వ్యాప్తంగా 223.93 లక్షల చేప పిల్లలు
- జిల్లా మత్స్యశాఖ అధికారి అవినాష్

**శెనార్తి మీడియా, మంచిర్యాల :**



జిల్లాలో ఉచిత చేప పిల్లల పంపిణీ కార్యక్రమాన్ని ఈ నెల 4వ తేదీ ఉదయం లక్షెట్టిపేట మండలం గుల్లకోట గ్రామంలోని శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులో జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రారంభించనున్నట్లు జిల్లా మత్స్యశాఖ అధికారి అవినాష్ తెలిపారు. 2025–26 సంవత్సరానికి గాను జిల్లాలో మొత్తం 223.93 లక్షల చేప పిల్లలను పెంచేందుకు ప్రణాళిక సిద్ధం చేశామని తెలిపారు. జిల్లాలో 380 చెరువులు, రిజర్వాయర్లు ఉన్నాయని, వీటిలో 369 సీజనల్ చెరువులలో 115.65 లక్షల 35–40 మిల్లీమీటర్ల చేప పిల్లలను, అలాగే 5 పేరినియల్ చెరువులు, 6 రిజర్వాయర్లలో 108.28 లక్షల 80–100 మిల్లీమీటర్ల చేప పిల్లలను వదిలే కార్యక్రమం చేపట్టనున్నట్లు వివరించారు. మంచిర్యాల నియోజకవర్గ పరిధిలో 51.58 లక్షల చేప పిల్లలు ఉచితం గా పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి స్థానిక ప్రజా ప్రతినిధులు హాజరై విజయవంతం చేయాలని అవినాష్ కోరారు.

# భవిష్యత్తు తరాలకు స్ఫూర్తిగా నిలిచారు

## ట్వీట్ చేసిన టీమిండియా క్రికెటర్ కోహ్లీ



మహిళల వన్డే ప్రపంచకప్ 2025లో విజేతగా నిలిచిన భారత హిళల జట్టుపై టీమిండియా మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లీ ప్రశంసల ల్లు కురిపించాడు. ఈ విజయంతో ఎన్నో తరాలకు స్ఫూర్తిగా లిచారని కొనియాడాడు. ఈ గెలుపుతో ప్రతీ భారతీయుడు గర్వ డుతున్నాడని, ఈ విజయానికి భారత అమ్మాయిలు పూర్తి అర్హులని ర్కొన్నాడు. ఈ మేరకు కోహ్లీ సోషల్ మీడియా వేదికగా ఓ పోస్ట్‌ను ర్ చేశాడు. ప్రపంచకప్‌తో ఉన్న మహిళల జట్టు ఫొటోను కూడా ంచుకున్నాడు.'భవిష్యత్తు తరాలకు స్ఫూర్తిగా నిలిచారు. మీ యర్‌లెస్ క్రికెట్, ఆత్మ విశ్వాసంతో ప్రతి భారతీయుడి గర్వించేలా శారు. మీరు అన్ని ప్రశంసలకు అర్హులు. ఈ క్షణాన్ని పూర్తి స్థాయిలో స్వాదించండి. హర్మన్ సేన అద్భుత ప్రదర్శన కనబర్చింది. జై ంద్.'అని విరాట్ కోహ్లీ ట్వీట్ చేశాడు. విరాట్ కోహ్లీతో పాటు డా, సినీ, రాజకీయ ప్రముఖులు కూడా భారత విజయాన్ని సోషల్ డియా వేదికగా కొనియాడారు.'1983 సంవత్సరం ఒక తరాన్ని ద్ద కలలు కనడానికి, వాటిని నెరవేర్చుకునేందుకు స్ఫూర్తినిచ్చింది. నేడు మన మహిళల క్రికెట్ అద్భుతమైన విజయాన్ని అందుకుంది. దేశవ్యాప్తంగా ఉన్న యువతులు బ్యాట్, బాల్ పట్టి మైదానంలో అడుగుపెట్టడానికి, తాము కూడా ఒక రోజు ట్రోఫీని గెలవగలమనే నమ్మకం కలిగిలే ఈ విజయం స్ఫూర్తినిచ్చింది. భారత మహిళల క్రికెట్ ప్రయాణంలో ఇది ఒక చారిత్రాత్మక ఘట్టం. టీమిండియా చాలా బాగా ఆడింది. దేశం మొత్తం గర్వపడేలా చేసింది.'అని సచిన్ ట్వీట్ చేశాడు. భారత మహిళల జట్టు కేవలం చరిత్ర సృష్టించలేదని, భవిష్యత్తులో ఆడపిల్లలకు స్ఫూర్తినిచ్చే ఒక మహత్తర వారసత్వాన్ని నెలకొల్పారని టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నాడు. 'భారత క్రికెట్‌కు ఇదో చారిత్రక ఘట్టం. మన మహిళల జట్టు పట్టుదల, ఓర్పు, విశ్వాసంతో ఏదైనా సాధిస్తుందని ప్రపంచానికి చూపించారు. వారికి నా అభినందనలు'అని టీమిండియా టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ ట్వీట్ చేశాడు. 'ఈ జట్టు చూపిన అసాధారణ ధైర్యం, విశ్వాసం అద్భుతం. మీరు దేశం మొత్తాన్ని గర్వపడేలా చేశారు. ఛాంపియన్స్, మీకు హృదయపూర్వక అభినందనలు'అని టీమిండియా వన్డే, టెస్ట్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ పేర్కొన్నాడు.

## ఏఐకి సొంత తెలివి తెప్పించేందుకు ప్రయత్నించొద్దు

### మైక్రోసాఫ్ట్ ఏఐ చీఫ్ కీలక వ్యాఖ్యలు



ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రోజురోజుకూ మరింత స్మార్ట్‌గా మారుతోంది. అడ్వాన్స్‌డ్ ఏఐ మోడళ్లను ఆవిష్కరించేందుకు గూగుల్, ఓపెన్‌ఏఐ, మెటా, మైక్రోసాఫ్ట్ వంటి కంపెనీలు పోటీపడుతున్నాయి. కోట్లాది రూపాయలు కుమ్మరిస్తున్నాయి. ఇప్పటికే మనుషులు చేసే చాలా పనులను ఏఐ చేయడం ప్రారంభించింది. అయితే, ఇప్పటికీ మనిషిలా ఆలోచించే స్పృహ ఈ ఏఐ మోడళ్లకు లేదు. అయితే, వాటికి కూడా మనిషిలా సొంతంగా ఆలోచించే తెలివితేటలు తీసుకొచ్చేందుకు చేస్తున్న ప్రాజెక్టులపై మైక్రోసాఫ్ట్ ఏఐ సీఈఓ ముస్తఫా సులేమాన్ కీలక వ్యాఖ్యలు చేశారు. అలాంటి ప్రాజెక్టులను ఆపేయాలని సూచించారు. ఈ విషయంలో ఏఐ ఎప్పుడూ మనిషిని చేరుకో లేదని పేర్కొన్నారు. ఈ మేరకు సీఎన్‌బీసీ నిర్వహించిన ఆఫ్రోటెక్ సదస్సులో ఆయన మాట్లాడారు. ఏఐకి సొంత తెలివితేటలు అబ్బేలా పరిశోధకులు, డెవలపర్లు చేస్తున్న ప్రయత్నాలను సులేమాన్ తప్పుబట్టారు. మనిషికి మాత్రమే నిజమైన ఎమోషన్లు ఉంటాయని పేర్కొన్నారు. ఈ ప్రయత్నాలు ఫలిస్తాయని తాను అనుకోవడం లేదన్నారు. అసలు ఆ దిశగా అడుగులు వేయడమే తప్పని వ్యాఖ్యానించారు. "ఒక తప్పు ప్రశ్న అడిగితే.. తప్పుడు సమాధానమే వస్తుంది. అంటే ఆ ప్రశ్న అడగడమే తప్పు" అని సులేమాన్ అన్నారు. ఏఐకి సొంతంగా ఆలోచించే ప్రాజెక్టులపై కాకుండా మనిషికి సహాయకారిగా ఉండే కృత్రిమ మేధ ప్రాజెక్టుల పైనే పనిచేయాలని డెవలపర్లకు సూచించారు. ఏఐ ఎంత వేగంగా అభివృద్ధి చెందినా మనిషి భావోద్వేగానికి, ఏఐకి కలిగే స్పందనలకు మధ్య సన్నని ఉత ఉంటుందని సులేమాన్ అన్నారు. ఫిజికల్‌గా మనం ఏదైనా బాధ కలిగినప్పుడు మనం చాలా బాధపడతాం. భయపడతాం. ఏఐ విషయంలో ఆ భావోద్వేగం కలగ డం అసాధ్యం. ఒకవేళ దానికి అ టువంటి భావోద్వేగాలు కలిగించాలని ప్ర యత్నించినా.. అది వాస్తవంగా అనుభవించదని పేర్కొన్నారు. ఈతరహా ప్రయత్నాలు చేస్తున్న సంస్థలకు వేర్వేరు లక్ష్యాలు ఉన్నప్పటికీ.. అలాంటి ప్రయత్నాలు చేయకుండా ఉండడమే మంచిదన్నారు. వాస్తవంగా వారికి 'స్పృహ' లేకపోవడం వల్లే ఆ తరహా పరిశోధనలపై సమయం వెచ్చిస్తున్నారని సులేమాన్ తప్పుబట్టారు.



## వన్డే ప్రపంచ కప్ విజేతకు బీసీసీఐ రూ.51 కోట్ల నజరానా

**ముంబాయి :** భారత మహిళా జట్టు విశ్వవిజేతగా నిలిచింది. మహిళల వన్డే ప్రపంచకప్ ఫైనల్‌లో దక్షిణాఫ్రికాను చిత్తు చేసిన టీమ్ఇండియా రూ.39 కోట్ల ప్రైజ్‌మనీని సొంతం చేసుకుంది. 47 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ హర్మన్ సేన ఛాంపియన్‌గా అవతరించింది. మిథాలీరాజ్ నాయకత్వంలో రెండుసార్లు ఫైనల్‌కు వెళ్లినా ఓటమి తప్పలేదు. ఈసారి ఎలాంటి పొరపాటు లేకుండా సఫారీ జట్టును చిత్తు చేసి భారత్ విజేతగా నిలిచింది. ఈ క్రమంలో భారత జట్టుపై సర్వత్రా ప్రశంసల జల్లు కురుస్తోంది. బీసీసీఐ కూడా జట్టుకు భారీ నజరానా ప్రకటించడం విశేషం. ఈ మేరకు బీసీసీఐ సెక్రటరీ దేవజిత్ సైకియా ఓ ప్రకటన విడుదల చేశారు. "బీసీసీఐ కార్యదర్శిగా జైషా బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి (2019–24) భారత మహిళా క్రికెట్‌కు అధిక ప్రాధాన్యం ఇవ్వడం మొదలైంది. ఇక ఐసీసీ ఛైర్మన్‌గా జైషా ప్రపంచ కప్ ప్రైజ్‌మనీ విషయంలోనూ ప్రత్యేకంగా నిలిచారు. పురుషుల జట్టు కంటే ఎక్కువ ప్రైజ్‌మనీని అందించారు. ఇప్పుడు ఛాంపియన్‌గా నిలిచిన భారత జట్టుకు బీసీసీఐ నుంచి రూ.51 కోట్ల నజరానా ఇస్తున్నాం. దీన్ని ప్లేయర్లు, కోచ్‌లు, సహాయక సిబ్బందికి అందజేస్తాం. 1983లో కపిల్‌దేవ్ నాయకత్వంలో టీమ్ఇండియా తొలిసారి ప్రపంచ కప్‌ను నెగ్గింది. అప్పటి నుంచి దేశంలో క్రికెట్‌కు విపరీతమైన ఆదరణ దక్కింది. ఇప్పుడు అమ్మాయిలు కూడా అద్భు తం చేసి చూపించారు. భవిష్యత్తులో మరింతమంది మహిళలు ఆటను ఎంచు కోవడానికి ఇదొక పునాదిగా మారుతుంది" అని వెల్లడించారు.

## శెభాష్ శ్రీచరణి

### ప్రపంచకప్ విజయంలో శ్రీ చరణిది కీలక పాత్ర



ఐసీసీ మహిళల ప్రపంచకప్–2025 ఛాంపియన్‌గా భారత్ నిలిచిన సంగతి తెలిసిందే. ఆదివారం జరిగిన ఫైనల్లో సౌతాఫ్రికాను ఓడించినన భారత జట్టు.. తమ 47 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణకు తెరదించింది. అయితే ఈ చారిత్రత్మక విజయంలో ఆంధ్రప్రదేశ్‌లోని కడప జిల్లాకు చెందిన యువ స్పిన్నర్ నల్లపురెడ్డి శ్రీ చరణిది కీలక పాత్ర. టోర్నీ అసాంతం అద్భుతమైన ప్రదర్శన కనబరిచి భారత్‌కు తొలి వన్డే వరల్డ్‌కప్‌ను అందించింది. ఈ 50 ఓవర్ల ప్రపంచకప్‌లో 9 మ్యాచ్‌లు ఆడిన శ్రీ చరణి 78 ఓవర్లు వేసి 14 వికెట్లు తీసింది. దీప్తి శర్మ తర్వాత భారత్ తరపున అత్యధిక వికెట్ల తీసిన జాబితాలో చరణి నిలిచింది. దీంతో ఈ కడప అమ్మాయిపై సర్వాత్ర ప్రశంసల వర్షం కురుస్తోంది.

### పల్లెటూర్ నుంచి వరల్డ్ ఛాంపియన్‌గా..

ఆంధ్రప్రదేశ్‌లోని కడప జిల్లా క్రీడా రంగంలో పెద్దగా పేరున్న ప్రాంతం కాదు. కానీ ఈ జిల్లాలోని వీరపునాయిని మండలం ఎర్రమల్లె గ్రామం నుంచి వచ్చిన నల్లపురెడ్డి శ్రీ చరణి.. భారత క్రికెట్ చరిత్రలో తనకంటూ ఒక అధ్యాయాన్ని లిఖించింది. ఆంధ్రప్రదేశ్ నుంచి పురుషుల లేదా మహిళల క్రికెట్‌లో ప్రపంచ కప్‌లో ఆడిన మొట్టమొదటి క్రీడాకారిణిగా నిలిచింది. కానీ, ఆమె ప్రయాణం అనేక కష్ట నష్టాల మధ్య సాగింది. 21 ఏళ్ల ఈ యువ లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ చిన్నతనంలో ఆమె బ్యాడ్మింటన్, కబడ్డీ, అథ్లెటిక్స్‌లో ప్రతిభ చూపింది. అయితే 16 ఏళ్ల వయస్సులో మాత్రమే ఆమె క్రికెట్‌ను సీరియస్‌గా తీసుకోవాలని నిర్ణయించుకుంది. ఈ నిర్ణయానికి ఆమె మావయ్య కిషోర్ కుమార్ రెడ్డి ప్రధాన కారణం. ఆమె క్రికెట్‌ను ఎంచుకోకపోవడానికి ప్రధాన అడ్డంకులు ఆర్థిక సమస్యలు, కుటుంబం నుంచి మొదట్లో వచ్చిన వ్యతిరేకత. ఆమె తండ్రి చంద్రశేఖర్ రెడ్డి రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్ట్‌లో చిన్న ఉద్యోగిగా పనిచేసేవారు. క్రికెట్ జట్టు ఎక్కువగా పురుషుల క్రీడ కావడంతో ఆమె తండ్రి మొదట్లో చరణి నిర్ణయానికి మద్దతు ఇవ్వలేదు. తండ్రిని ఒప్పించడానికి ఆమెకు ఏడాది కాలం పట్టింది. చరణి చెప్పిన ప్రకారం.. ఆమె క్రీడా జీవితాన్ని ప్రారంభించే సమయంలో తన కుటుంబం అప్పులతో బాధపడేది. అయినప్పటికీ ఆ కష్టాలు తన ఆటపై ప్రభావం చూపకుండా ఆమె తల్లిదండ్రులు సహకరించారు. క్రీడా జీవితం ప్రారంభంలో శ్రీ చరణి మొదట ఫాస్ట్ బౌలర్‌గా శిక్షణ పొందింది. ఫాస్ట్ బౌలింగ్‌లో వికెట్లు లభించకపోవడంతో స్పిన్ బౌలింగ్‌ను ప్రయత్నించగా బాగా కలిసి వచ్చింది. ఆ తర్వాత ఆమె నెమ్మదిగా లెఫ్ట్ ఆర్మ్ ఆర్థోడాక్స్ స్పిన్నర్‌గా మారింది. కడప లాంటి మారుమూల ప్రాంతం నుంచి వచ్చి కేవలం రెండేళ్ల వ్యవధిలోనే ఉమెన్స్ ప్రీమియర్ లీగ్ ద్వారా సెలెక్టర్ల దృష్టిలో పడింది. అంతర్జాతీయ క్రికెట్‌కు ఎంపిక కావడం ఆమె అచంచలమైన పట్టుదలకు, కష్టపడే తత్వానికి నిదర్శనం. ఆర్థిక కష్టాలు ఆమె ఆశయాన్ని ఆపలేకపోయాయి.



## టాటా ట్రస్ట్స్ బోర్డు నుంచి తొలగింపు

### సవాల్ చేసిన మెహ్లీ మిస్త్రీ..

**ముంబయి:** టాటా గ్రూప్‌లో అంతర్గత విభేదాలు మరింత ముదురుతున్నట్లే కన్పిస్తోంది. దివంగత పారిశ్రామికవేత్త రతన్ టాటా అత్యంత సన్నిహితుల్లో ఒకరైన మెహ్లీ మిస్త్రీని జీవితకాల ట్రస్టీగా పునర్నియమించేందుకు టాటా ట్రస్ట్స్‌లో ఇటీవల ఆమోదం లభించని సంగతి తెలిసిందే. దీనిపై తాజాగా ఆయన న్యాయపోరాటం మొదలుపెట్టినట్లు తెలుస్తోంది. టాటా ట్రస్ట్స్ నిర్ణయాన్ని మెహ్లీ మిస్త్రీ ముంబయి ఛారిటీ కమిషనర్ ఎదుట సవాల్ చేసినట్లు సమాచారం. ఈ వ్యవహారంపై ఆయన కేవియెట్ దాఖలు చేసినట్లు పలు ఆంగ్ల మీడియా కథనాలు వెల్లడించాయి. టాటా ట్రస్ట్స్‌లోని ట్రస్టీల జాబితాలో మార్పులు ఆమోదించడానికి ముందు తన వాదన వినాలని మెహ్లీ మిస్త్రీ తన పిటిషన్‌లో కోరినట్లు తెలుస్తోంది. ట్రస్టీలందరికీ జీవితకాల నియామకం కల్పించాలని గతేడాది అక్టోబరులో టాటా ట్రస్ట్స్ బోర్డు తీర్మానం ఆమోదించిన విషయాన్ని ఆయన కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. మహారాష్ట్ర పబ్లిక్ ట్రస్ట్స్ చట్టం ప్రకారం.. ఏదైనా ట్రస్ట్‌లు తమ ట్రస్టీల జాబితాలో మార్పులు చేస్తే ఆ వివరాలను 90 రోజుల్లోగా కమిషనర్ ఆఫీసుకు తెలియజేయాల్సి ఉంటుంది. టాటా ట్రస్ట్స్ ఇంకా ఆ వివరాలను వెల్లడించలేదని తెలుస్తోంది. సర్ రతన్ టాటా ట్రస్ట్, సర్ దొరాబ్జీ టాటా ట్రస్ట్, బాయి హీరాబాయి జంషెడ్జీ టాటా నవ్సారి ఛారిటబుల్ ఇన్‌స్టిట్యూషన్‌కు ట్రస్టీగా మెహ్లీ మిస్త్రీని పునర్నియమించే ప్రతిపాదనకు అనుమతిని కోరుతూ ఇతర ట్రస్టీలకు టాటా ట్రస్ట్స్ సీఈఓ ఇటీవల ఒక సర్క్యులర్ పంపారు. ఈ ప్రతిపాదనను ట్రస్టీలు నోయల్ టాటా, వేణు శ్రీనివాసన్, విజయ్ సింగ్ వ్యతిరేకించారు. ట్రస్ట్‌ల్లో మెజార్టీ దక్కకపోవడంతో మెహ్లీ పునర్నియామకానికి ఆమోదం లభించలేదు. మెహ్లీ మిస్త్రీ 2022లో టాటా ట్రస్ట్స్‌కు ట్రస్టీగా నియమితులయ్యారు. ఆయన మూడేళ్ల పదవీకాలం అక్టోబరు 28తో ముగిసింది.

## షెఫాలీ బౌలింగే మాకు సర్‌ప్రైజ్.. మేం సిద్ధం కాలేకపోయాం

### దక్షిణాఫ్రికా కెప్టెన్ లారా



**ముంబాయి :** వన్డే క్రికెట్‌లో 300 పరుగుల లక్ష్యమంటే ఇప్పుడు మహిళల మ్యాచుల్లోనూ కష్టమేం కాదు. వన్డే ప్రపంచ కప్ సెమీస్‌లోనూ భారత్ ఆసీస్‌పై భారీ టార్గెట్‌ను ఛేదించి గెలిచింది. దీంతో ఫైనల్‌లో దక్షిణాఫ్రికా కూడా ఛేదిస్తుందేమోనని అంతా భావించారు. కానీ, టీమ్ఇండియా కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్ తీసుకున్న ఓ నిర్ణయమే తమ కొంపముంచిందని దక్షిణాఫ్రికా సారథి లారా వోల్వార్ట్ వెల్లడించింది. తాము అంచనా వేయడంలో విఫలమైనట్లు అంఉకరించింది. ఇంతకీ ఆ నిర్ణయం ఏంటంటే.. షెఫాలీ వర్మను బౌలింగ్‌కు తీసుకురావడమే నని లారా తెలిపింది. "షెఫాలీ బౌలింగ్ ఇలా ఉంటుందని మేం అస్సలు ఊహించలేదు. మాకు అదే సర్‌ప్రైజ్. చాలా నెమ్మదిగా బంతిని సంధించింది. రెండు వికెట్లను కూడా తీసింది. వరల్డ్ కప్ ఫైనల్ వంటి మ్యా చుల్లో పార్ట్ టైం బౌలర్లకు వికెట్లు కోల్పోవడం సరికాదు. కీలక వికెట్లను తీయడంతో మేం తీవ్ర నిరుత్సాహానికి గురయ్యాం. ఆమెకు మరిన్ని వికెట్లు ఇవ్వకూడదని చాలా పొరపాట్లు చేశాం. చాలా అద్భుతంగా బౌలింగ్ చేసింది. మేం ఆమె బౌలింగ్ కోసం అస్సలు సన్నద్ధం కాలేదు. భారత్ తీసుకున్న ఈ నిర్ణయం మమ్మల్ని షాక్‌తోపాటు ఆశ్చర్యానికి గురి చేసింది" అని లారా వెల్లడించింది.

## ఆఫ్ఘనిస్తాన్ క్లీన్ స్వీప్




ఆఫ్ఘనిస్తాన్ జట్టు జింబాబ్వేను వారి సొంత గడ్డపై ఊడ్చేసింది. 3 మ్యాచ్‌ల సిరీస్‌ను 3–0 తేడాతో కైవసం చేసుకుంది. నిన్న (నవంబర్ 2) జరిగిన నామమాత్రపు మూడో మ్యాచ్‌లో 9 పరుగుల తేడాతో గెలుపొందింది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసి నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 210 పరుగులు చేసింది. ఓపెనర్లు రహ్మనుల్లా గుర్బాజ్ (92), ఇబ్రహీం జద్రాన్ (60) చెలరేగారు. ఆఖర్లో సెదిఖుల్లా అటల్ (35 నాటౌట్) సైతం మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. జింబాబ్వే బౌలర్లలో ఈవాన్స్ 2, నగరవ ఓ వికెట్ పడగొట్టారు. అనంతరం భారీ లక్ష్య ఛేదనలో జింబాబ్వే సైతం అద్భుతంగా పోరాడింది. నిర్ణీత ఓవర్లు బ్యాటింగ్ చేసి 201 పరుగులకు ఆలౌటైంది. సికందర్ రజా (51), బ్రియాన్ బెన్నెట్ (47), ర్యాన్ బర్ల్ (37), ముసేకివా (28) పోరాడారు. ఆఫ్ఘనిస్తాన్ బౌలర్లలో అహ్మద్‌జాయ్ 3, ఫజల్ హక్ ఫారూకీ, ఫరీద్ అహ్మద్ మాలిక్ తలో 2, ముజీబ్, నబీ చెరో వికెట్ తీశారు. ఈ సిరీస్‌కు ముందు ఇరు జట్ల మధ్య జరిగిన ఏకైక టెస్ట్ మ్యాచ్‌లో జింబాబ్వే ఇన్నింగ్స్ 73 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది.

## మనీలాండరింగ్ కేసు..

### అనిల్ అంబానీ ఇల్లు సహా రూ.3 వేల కోట్ల ఆస్తులు అటాచ్



**న్యూఢిల్లీ :** మనీలాండరింగ్ ఆరోపణలు ఎదుర్కొంటోన్న రిలయన్స్ గ్రూప్ ఛైర్మన్ అనిల్ అంబానీపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ చర్యలు చేపట్టింది. దర్యాప్తులో భాగంగా అనిల్ అంబానీకి సంబంధించిన రూ.3వేల కోట్లకు పైగా విలువైన ఆస్తులను అటాచ్ చేసింది. ఈ మేరకు ఈడీ అధికారిక వర్గాలు సోమవారం వెల్లడించాయి. అటాచ్ చేసిన ఆస్తుల జాబితాలో ఆయన నివాసంతో పాటు పలు కమర్షియల్ ప్రాపర్టీలు ఉన్నాయి. ముంబయిలోని పాలి హిల్ ప్రాంతంలో గల అనిల్ అంబానీ నివాసం, దిల్లీలోని రిలయన్స్ సెంటర్‌కు చెందిన కొంత భూమిని ఈడీ అటాచ్ చేసింది. వీటితో పాటు దిల్లీ, నోయిడా, గాజియాబాద్, ముంబయి, పుణె, ఠాణె, హైదరాబాద్, చెన్నై, తూర్పుగోదావరిలో అనిల్ అంబానీ కంపెనీలకు చెందిన పలు నివాస, వాణిజ్య ఆస్తులు ఈ జాబితాలో ఉన్నాయి. వీటి మొత్తం విలువ రూ.3,084 కోట్లు అని అధికారిక వర్గాలు పేర్కొన్నాయి. అనిల్ గ్రూప్ కంపెనీలు కోట్ల రూపాయల బ్యాంకు రుణాల మోసానికి పాల్పడినట్లు ఆరోపణలు రావడంతో సీబీఐ దర్యాప్తు చేపట్టింది. కేంద్ర దర్యాప్తు సంస్థ ఎఫ్‌ఐఆర్ ఆధారంగా ఈడీ దీనిపై మనీలాండరింగ్ కేసు నమోదు చేసింది. రిలయన్స్ ఇన్‌ఫ్రా సహా అనిల్ అంబానీకి చెందిన పలు కంపెనీలు రూ.17,000 కోట్లకు పైగా నిధులను అక్రమంగా తరలించినట్లు ఆరోపణలున్నాయి. ఈ క్రమంలోనే ఈ ఏడాది జులైలో రిలయన్స్ గ్రూప్‌లోని 50 కంపెనీలకు చెందిన 35 ప్రాంతాల్లో, 25 మంది వ్యక్తులపై ఈడీ సోదాలు నిర్వహించింది. ఆగస్టులో అనిల్ అంబానీ సహా కంపెనీకి చెందిన పలువురు ఎగ్జిక్యూటివ్ అధికారులను విచారించిన సంగతి తెలిసిందే.

## భారత్‌తో చివరి రెండు టీ20లకు ట్రావిస్ హెడ్ దూరం




భారత్‌తో జరుగుతున్న ఐదు టీ20ల సిరీస్‌లో మిగిలిన రెండు మ్యాచ్‌లకు ఆస్ట్రేలియా ఓపెనర్ ట్రావిస్ హెడ్ దూరమయ్యాడు. నవంబర్ 21 నుంచి ప్రారంభంకానున్న యాషెస్ సిరీస్‌పై దృష్టిపెట్టడానికి హెడ్‌ని టీ20 జట్టు నుంచి విడుదల చేశారు. షెఫీల్డ్ షీల్డ్ టోర్నీలో సౌత్ ఆస్ట్రేలియా తరఫున ఆడాలని అతడిని ఆదేశించారు. హెడ్ స్థానంలో బెన్ డ్వార్షుయిస్‌ని చివరి రెండు టీ20లకు తీసుకున్నారు. నవంబర్ 6న నాలుగో టీ20, 8న ఐదో టీ20 జరగనుంది. తొలి మ్యాచ్ వర్షం కారణంగా రద్దవగా.. తర్వాత ఆస్ట్రేలియా, భారత్ చెరో దాంట్లో గెలిచాయి. దీంతో సిరీస్ 1–1తో సమం అయింది.

## విశ్వ విజేతలకు డైమండ్ నెక్లెస్‌లు..



తొలి వన్డే వరల్డ్‌కప్‌ను గెలిచి భారత మహిళల క్రికెట్ జట్టు చరిత్ర సృష్టించిన సంగతి తెలిసిందే. ఆదివారం జరిగిన ఫైనల్లో 52 పరుగుల తేడాతో సౌతాఫ్రికాను ఓడించిన భారత జట్టు.. తమ చిరకాల స్వప్నాన్ని నేరవేర్చుకుంది. అంజుమ్ చోప్రా, జులాన్ గో స్వామి, మిథాలీ రాజ్ వంటి దిగ్గజ కెప్టెన్లకు సాధ్యం కాని వరల్డ్‌కప్‌ను హర్మన్ ప్రీత్ కౌర్ భారత్‌కు అందించింది. దీంతో ఉమెన్ ఇన్ బ్లూపై సర్వాత్ర ప్రశంసల వర్షం కురుస్తోంది. ఈ నేపథ్యంలో భారత జట్టుకు పారిశ్రామికవేత్త, రాజ్యసభ సభ్యులు గోవింద్ ధోలాకియా ప్రత్యేక బహుమతిని ప్రకటించారు. సూరత్‌కు చెందిన గోవింద్ ధోలాకియా.. హర్మన్ సేనకు వజ్రాభరణాలు(డైమండ్ నెక్లస్), సోలార్ ప్యానెళ్లను గిఫ్ట్‌గా ఇవ్వనున్నట్లు వెల్లడించారు. ఆదివారం ఫైనల్ మ్యాచ్‌కు ముందు ధోలాకియా బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లాకు లేఖ రాశారు. "వన్డే వరల్డ్‌ప్‌లో మన భారత మహిళల జట్టు అద్భుతమైన ప్రదర్శన కనబరుస్తోంది. ఫైనల్లో కూడా విజయం సాధించి మన అమ్మాయిలు ఛాంపియన్‌గా నిలుస్తారని ఆశిస్తున్నాను. ఒకవేళ భారత్ కప్‌ను గెలుచుకుంటే జట్టులో సభ్యులందరికీ వజ్రాల ఆభరణాలను కానుకగా ఇవ్వాలనుకుంటున్నాను. దీంతో పాటు వారందరి ఇళ్లపై సోలార్ ప్యానెళ్లను ఏర్పాటు చేయాలనుకుంటున్నాను" అని ఆయన ఆ లేఖలో పేర్కొన్నారు. ఇప్పుడు భారత జట్టు విశ్వ విజేతగా నిలవడంతో ధోలాకియా తన మాటను నిలబెట్టుకోనున్నారు. త్వరలోనే జట్టులోని ప్రతీ ఒక్కరికి తన ప్రకటించిన గిఫ్ట్‌లను ఇవ్వనున్నట్లు ఆయన సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. కాగా వరల్డ్ ఛాంపియన్స్‌కు బీసీసీఐ కూడా భారీ నజరానా ప్రకటించింది. భారత జట్టుతో పాటు సహాయక సిబ్బందికి కలిపి రూ. 51 కోట్ల భారీ నగదు బహుమతిని భారత క్రికెట్ బోర్డు ఇవ్వనుంది.



# మనశంకర వరప్రసాద్ బిజీ

సంక్రాంతి బరిలో ’మన శంకరవరప్రసాద్‌గారు’గా సందడి చేయనున్నారు కథానాయకుడు చిరంజీవి. ఈ మూవీ షూటింగ్ శరవవేగంగా సాగుతోంది. ఇప్పటికే చాలా పార్ట్ పూర్తయ్యింది. పాటలు కూడా మంచి రెస్పాన్స్ క్రియేట్ చేస్తున్నాయి. ఆయన టైటిల్ పాత్ర పోషిస్తున్న ఈ సినిమాని అనిల్ రావిపూడి తెరకెక్కిస్తున్నారు. సాహు గారపాటి, సుస్మిత కొణిదెల నిర్మిస్తున్నారు. నయనతార కథానాయిక. ముగింపు దశలో ఉన్న ఈ సినిమా ఆదివారం నుంచి హైదరాబాద్‌లో క్లైమాక్స్ యాక్షన్ సీక్వెన్స్‌ను ప్రారంభించుకుంది. చిరుతో పాటు బృందంపై తెరకెక్కిస్తున్న ఈ భారీ పోరాట ఘట్టానికి యాక్షన్ కొరియోగ్రాఫర్ వెంకట్ నేతృత్వం వహిస్తున్నారు. ఈ ÷–లక్లైమాక్స్ యాక్షన్ సీక్వెన్స్ ప్రేక్షకులకు మరిచిపోలేని అనుభూతిని అందిస్తుందని చిత్ర వర్గాలు తెలిపాయి. ఆద్యంతం వినోదాత్మకంగా సాగే ఈ ఫ్యామిలీ యాక్షన్ డ్రామాలో హీరో వెంకటేశ్ ఓ కీలక పాత్ర పోషిస్తున్నారు.



# నా వయసు తగ్గుతుంది..

## బంగారం రేటు పెరుగుతుంది..

బుల్లితెర నుంచి వెండి తెరకు షిఫ్ట్ అయిన హాట్ బ్యూటీ అనసూయ భరద్వాజ్ తన అందచందాలతో నిత్యం సోషల్ మీడియాను వేడెక్కిస్తుంటుంది. హాట్ హాట్ ఫోజులతో కుర్రాళ్ల మతి పోగొడుతుంది. అంతేనా.. తనపై ఎవరైన అసభ్యకరంగా కామెంట్స్ చేస్తే వారిని ఉతికి ఆరేస్తుంది. తాజాగా ఈ రంగమ్మత్త ఆసక్తికర కామెంట్స్ చేసింది. రోజురోజుకీ నా వయసు తగ్గుతుంది.. బంగారం రేటు పెరుగుతుందని హాట్ కామెంట్స్ చేశారు. ఆఫర్లు ఉన్నప్పుడే బంగారం వెనకేసుకోవాలన్నారు. బంగారం అనేది మహిళలకి సౌందర్యంగా.., మగవారికి పొదుపు లాగా ఉంటుందన్నారు. బంగారం తక్కువ రేటు ఉన్నప్పుడే కొనుగోలు చేసి పొదుపు చేసుకోవాలని సూచించారు. మహిళలు క్రికెట్‌లో చరిత్ర సృష్టించి మొదటిసారి భారతదేశానికి వరల్డ్ కప్ తేవడంపై అనసూయ సంతోషంగా వ్యక్తం చేశారు. దేశానికి వరల్డ్ కప్పు రావడం ప్రతి మహిళకు గర్వకారణమన్నారు. విరోచిత పోరాటం చేసి దేశానికి వరల్డ్ కప్పు తెచ్చిన మహిళా క్రీడాకారులకు అభినందనలు తెలిపారు. అర్జున్ రెడ్డి ఫేమ్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగ దర్శకత్వం వహిస్తున్న ప్రభాస్ స్పిరిట్ సినిమాలో తను నటించడం లేదని అనసూయ క్లారిటీ ఇచ్చారు. స్పిరిట్ సినిమాలో నేను నటిస్తున్నానని సోషల్ మీడియాలో వచ్చే వార్తల్లో నిజం లేదని ఆమె తేల్చి చెప్పారు.

# శివలో మోహన్‌బాబును

# రిజెక్ట్ చేసిన వర్మ



తెలుగు సినిమా చరిత్రను రాయాల్సి వస్తే, శివకు ముందు తర్వాత అంటూ పేర్కొంటారు సినీ విశ్లేషకులు. కేవలం తెలుగు మూవీపైనే కాదు, భారతీయ సినిమాలో ఒక ట్రెండ్‌ను సృష్టించింది. రాంగోపాల్‌వర్మ దర్శకత్వంలో నాగార్జున కథానాయకుడిగా నటించిన ఈ చిత్రం కల్ట్ మూవీగా బాక్సాఫీస్ వద్ద ఘన విజయాన్ని అందుకుంది. అత్యాధునిక హంగులతో, 4కె విజువల్స్‌తో నవంబరు 14న ఈ మూవీ మరోసారి ప్రేక్షకులకు ముందుకు రానున్న సందర్భంగా ఈ ఆసక్తికర విషయాలు మీకోసం.. శివ సినిమాలో నటించిన నాగార్జున, రఘువరన్, అమల ఇలా ఓ నలుగురైదుగురు మినహాయిస్తే, అందరూ కొత్తవారు. ఇందులోని ఓ పాత్ర కోసం విలక్షణ నటుడు మోహన్‌బాబు పేరును చిత్ర బృందం పరిశీలించింది. అటు దర్శకత్వశాఖతో పాటు, ఇతర టెక్నీషియన్స్ కూడా అప్పుడే ఇండస్ట్రీక్రి వచ్చారు. ఈ సినిమా కథా చర్చలు జరుగుతుండగా, రఘువరన్ దగ్గర రౌడీగా పనిచేసే గణెశిశ్ పాత్రకు ఎవరిని తీసుకోవాలా?అని చర్చిస్తుండగా, నిర్మాత అక్కినేని వెంకట్ మోహన్‌బాబు పేరును సూచించారు. హీరోకు వార్నింగ్ ఇచ్చే స్థాయి ఉండాలంటే ందరికీ తెలిసిన నటుడు అయితే బాగుంటుందని సలహా ఇచ్చారు. పైగా అప్పటికే ఆయన ప్రతినాయకుడిగా పలు ాత్రల్లో నటించి మెప్పించారు. ఆయనతో తనకున్న పరిచయంతో సులభంగా ఒప్పిస్తానని కూడా చెప్పారు. అయితే, ందుకు రాంగోపాల్‌వర్మ ససేమిరా అన్నారు. ఆ పాత్రలో మోహన్‌బాబును పెట్టుకుంటే ఆ సీన్ ఎఫెక్టివ్‌గా ఉండదని న్నారట. అందుకు కారణం కూడా వర్మ చెప్పారు. తెలుగు ప్రేక్షకులకు మోహన్‌బాబు సుపరిచితులు. ఆయన టన, డైలాగ్ డిక్షన్ ప్రత్యేకంగా ఉంటుంది. అలాంటి వ్యక్తి శివ పాత్రకు వార్నింగ్ ఇస్తుంటే, ఆ పాత్రలో ప్రేక్షకుడికి ోహన్‌బాబు కనపడతారు తప్ప, కరుడుగట్టిన రౌడీ కనిపించడని వర్మ అన్నారట. దీంతో ఆ పాత్రలో విశ్వనాథ్ నే నటుడుని తీసుకున్నారు. ఇక శివలో ఎలాంటి డూప్ లేకుండా నాగార్జున ఒక స్టంట్ చేశారు. లారీని పట్టుకుని ైకిల్‌పై వెళ్లడం. తనని చంపడానికి వచ్చిన రౌడీల నుంచి తప్పించుకునే క్రమంలో పాపను సైకిల్‌పై ఎక్కించుకుని ాగార్జున వెళ్తుంటారు. అప్పట్లో అది అంత డేంజరస్ షాట్ అని వర్మకు అనిపించలేదట.

# కర్మ ఎవరినీ వదిలిపెట్టదు




ాలీవుడ్ సింగర్‌గా ఫుల్ పాపులారిటీ చ్చుకున్న చిన్మయి డబ్బింగ్ ఆర్టిస్ట్‌గానూ సింది. సమంతకు డబ్బింగ్ చెప్పిన ఆమె లు చిత్రాల్లో తన ముద్దు ముద్దు ాటలతో అందరినీ ఆశ్చర్యపరి చింది. లుగు, తమిళంలో పలు పాటలు పాడిన న్మయి కెరీర్ మంచి ఫామ్‌లో ఉండగానే ోలీవుడ్ నిషేధం విధించింది. మీటూ ఉ ్యమం పట్ల చిన్మయి చేసిన వ్యాఖ్యలు ద్ద దుమారం రేపడంతో నిషేధం ధించగా.. గత కొద్ది కాలంగా ్రొఫెషనల్ లైఫ్‌కు దూరంగా ఉంటుంది. ానీ పర్సనల్ లైఫ్‌ను ఎంజాయ్ చేస్తు న్న న్మయి.. సోషల్ మీడియాలో ఫుల్ ాక్టివ్‌గా ఉంటుంది. ని త్యం పలు వాదాస్పద పోస్టులతో వార్తల్లో లుస్తోంది. తాజాగా, చిన్మయి ఓ ఇద్దరి ురించి సెన్సేషనల్ పోస్ట్ పెట్టింది. ్రముఖ డ్యాన్స్ కొరియోగ్రాఫర్లు జానీ మాస్టర్, సింగర్ కార్తీక్‌కు అవకాశాలు ఇవ్వడంపై నదైన స్టైల్లో స్పందించింది. “జానీ మాస్టర్, సింగర్ కార్తీక్ వంటి వాళ్లకు ఇండస్ట్రీలో ురోసారి అవకాశాలు ఇవ్వడం అంటే లైంగిక వేధింపులకు మద్దతు తెలపడమే. డబ్బును ధికారాన్ని దుర్వినియోగం చేసే వారి చేతుల్లో పెట్టొద్దు. మనం నమ్మే కర్మ సిద్ధాంతం జమైతే.. కర్మ అసలు ఎవరినీ వదిలిపెట్టదు” అని రాసుకొచ్చింది. కాగా.. ఇటీవల కార్తీక్, ానీ మాస్టర్ లైంగిక ఆరోపణలు ఎదుర్కొన్న విషయం తెలిసిందే.

# అవార్డుల కన్నా

# ప్రశంసలే మిన్న

## నటుడు పరేశ్ రావెల్ వెల్లడి





నటీనటులకు అవార్డుల కంటే దర్శకనిర్మాతల ప్రశంసలు గొప్పవని నటుడు పరేశ్ రావల్ చెప్పారు. సినీ పురస్కారాల విషయంలో తన అభిప్రాయాన్ని పంచుకున్నారు. ఎన్నో ప్రతిష్ఠాత్మకమైన అవార్డుల విషయంలో లాబీయింగ్‌కు ఆస్కారం ఉందన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఇవే పద్ధతులు ఉ న్నాయన్నారు. నాకు అవార్డుల గురించి అంతగా తెలియదు. కానీ, నేషనల్ అవార్డుల విషయంలో లాబీయింగ్‌కు ఆస్కారం ఉంటుంది. ఇతర పురస్కారాలతో పోలిస్తే జాతీయ పురస్కారాల విషయంలో లాబీయింగ్ ప్రయత్నాలు ఎక్కువగా ఉంటాయి. ఆస్కార్ అవార్డుల్లోనూ దీనికి ఆస్కారం ఉంది. చిత్రబృందం నెట్‌వర్క్, కొన్ని పార్టీల ద్వారా ప్రయత్నాలు జరుగుతాయి. చిత్రనిర్మాతలు జ్యూరీ సభ్యులను ఆకర్షించడానికి ప్రయత్నిస్తారు. ’ఇది ఫలనా దర్శకుడి సినిమా’ అని ఒక్కోసారి ప్రత్యేక శ్రద్ధ చూపిస్తుంటారు‘ అంటూ తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. తనకు అవార్డుల కంటే ’నటన బాగుందని’ ప్రశంసలు వస్తే ఎంతో ఆనందంగా ఉ ంటుందన్నారు. బిరుదులు, ట్రోఫీల కంటే దర్శకనిర్మాతల ప్రశంసలే ఎక్కువ విలువైనవని తెలిపారు. ఇక ’వో ఛోకరీ’, ’సర్’ సినిమాల్లో ఉత్తమ నటనకు గాను పరేశ్ 1994లో ఉ త్తమ సహాయనటుడిగా జాతీయ అవార్డు అందుకున్నారు.



# మహేశ్‌బాబు యవ్వన రహస్యం

# ఏమిటో?: రష్మిక

మహేశ్‌బాబు యవ్వన రహస్యం ఏమిటో తెలుసుకోవాలని ఉందని నటి రష్మిక ఆసక్తిని వ్యక్తం చేసింది. రష్మిక కథానాయికగా రూపొందిన తాజా చిత్రం ’ది గర్ల్‌ఫ్రెండ్’ రాహుల్ రవీంద్రన్ దర్శకత్వం వహిస్తున్నారు. ధీరజ్ మొగిలినేని, విద్య కొప్పినీడి నిర్మాతలు. అల్లు అరవింద్ సమర్పకులు. దీక్షిత్‌శెట్టి కీలక పాత్ర పోషిస్తున్నారు. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ మూవీ నవంబరు 7న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా రష్మిక సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా అభిమానులతో ముచ్చటించారు. వారు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానమిచ్చారు. ప్రస్తుతం పాన్ ఇండియా ఫిల్మ్స్ చేస్తున్నా. నేరుగా తమిళ మూవీ చేయడానికి కొంత సమయం పడుతుంది. ప్రస్తుతం చాలా వరకూ చర్చల దశలోనే ఉన్నాయి. త్వరలోనే ఇది కార్యరూపం దాల్చుతుందని భావిస్తున్నా. నాకంటూ కొంతమంది బెస్టీస్ ఉన్నారు. పబ్లిక్‌లో వాళ్ల పేరు చెబితే నన్ను చంపేస్తారని అంటూ సరదాగా కామెంట్ చేశారు. మహేశ్‌బాబులో మీకు నచ్చేది ఏదని అడిగితే.. సర్‌కి ఎప్పటికీ వయసు అయిపోవడం లేదు. పైగా నానాటికీ వయసు తగ్గుతోంది. అది నాకు బాగా ఇష్టం. అదెలా సాధ్యమో నాకు తెలుసుకోవాలని ఉ ందని చిలిపిగా చెప్పింది. ది గర్ల్‌ఫ్రెండ్, థామా వీటిల్లో ఏ సినిమా చేయటం మీకు అత్యంత కష్టంగా అనిపించిందని అడగ్గా ది గర్ల్‌ఫ్రెండ్ మూవీయే అంటూ తెలిపింది.



# నానికి తల్లిగా సోనాలి కులకర్ణి

సోనాలి కులకర్ణికి జాతీయ స్థాయిలో మంచి పేరుంది. మరాఠీ, హిందీ, గుజరాతీ, తమిళ, ఇంగ్లిష్ చిత్రాలలో నటించిన సోనాలీ కులకర్ణి ఏ పాత్ర చేసినా అందులోకి పరకాయ ప్రవేశం చేస్తుంది. నేచురల్ స్టార్ నాని హీరోగా శ్రీకాంత్ ఓదెల తెరకెక్కిస్తున్న ది ప్యారడైజ్ మూవీలో సోనాలి కులకర్ణి కీలక పాత్రను పోషిస్తోంది. నవంబర్ 3 సోనాలి కులకర్ణి పుట్టిన రోజు. ఈ సందర్భంగా ది ప్యారడైజ్ మేకర్స్ ఆమెకు శు భాకాంక్షలు తెలియచేస్తూ ఓ పోస్టర్ ను విడుదల చేశారు. ఈ సినిమా నుండి వచ్చిన రా స్టేట్ మెంట్ గ్లింప్స్ కు సోనాలి కులకర్ణి ఇచ్చిన వాయిస్ నూ ఎవ్వరూ అంత తేలికగా మర్చిపోరు. ఓ పెక్యులర్ మాడ్యుల్ లో సోనాలి కులకర్ణి రా గా చెప్పిన డైలాగ్స్ డైనమేట్ మాదిరి పేలాయి. ఆ గ్లింప్స్ లోని వాయిస్ ను వింటే... నాని తల్లి పాత్రను సోనాలి కులకర్ణి చేస్తోందనే విషయం బోధపడుతుంది. ఇందులో ఆమె పాత్ర కూడా అద్భుతంగా ఉంటుందని మేకర్స్ చెబుతున్నారు. చాలామంది సోనాలి కులకర్ణి నటిస్తున్న తొలి తెలుగు సినిమా ది ప్యారడైజ్ అనుకుంటారు కానీ ఆమె చాలా కాలం క్రితమే తెలుగులో మోహన్ కోడా స్వీయ దర్శకత్వంలో నిర్మించిన ఎల్లమ్మ అనే చిత్రంలో నటించింది. ఆ సినిమాలో నాజర్, రేవతి కీలక పాత్రలు పోషించారు. ఇక ది ప్యారడైజ్ విషయానికి వస్తే... ఎస్.ఎల్.వి. సినిమాస్ పతాకంపై సుధాకర్ చెరుకూరి ప్రొడ్యూస్ చేస్తున్న ఈ మూవీలో మరో కీలక పాత్రను విలక్షణ నటుడు మోహన్ బాబు చేస్తున్నాడు. అవినాశ్ కొల్లా ప్రొడక్షన్ డిజైనర్ గా వ్యవహరిస్తున్న ఈ సినిమా వచ్చే యేడాది మార్చి 26న తెలుగు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళ, బెంగాలీ, ఇంగ్లిష్, స్పానిష్ భాషల్లో విడుదల కానుంది.